# మరణ శిక్ష

తీర్పు తెర తొలగిపోగానే
జారి పోతున్న క్షణాలన్నీ
ఒక్కొక్క రక్త బిందువుని హరిస్తున్నాయి.
రోజూ పలకరించే ఉదయాస్తమయాలు
క్రమం తప్పకుండా వీడ్కోలు చెప్తున్నాయి.
అరచేతిలో అదిమిపెట్టుకోవాలనుకున్న ఆఖరు కిరణాలు
మెలమెల్లగా అంతర్ధానమై పోతున్నాయి
స్వజనాలు వదిలి వెళ్లిన రుధిరాశ్రువులు
తడితడిగా తలనలా నిమురుతూనే ఉన్నాయి.

ఆకలి ఆశయాలు ఆత్మాభిమానాలు ఆయుధాలై
పట్టుబడ్డప్పుడే ఫలితం తెలిసినా
మెడకో ఉరితాడు ఊహించుకుంటున్నప్పుడు
బోను నిబిడాంధకారంలో ఘనీభవించిన మౌనం
కారణం ఏదైనా కానీ–
ఖాకీ బూట్లు
నల్ల కోట్లయినా
ప్రాణానికి ప్రాణమే వారి న్యాయం
అధికార కవచమైనా లేకుండా వేటాడటం ఎంత నేరం?
వలలో చిక్కుకున్నాక బయటపడలేని నిస్సహాయత.

ఏముందీ?
ఇంత జరిగాక!
కబేళాలో తనవంతు కోసం ఎదురు చూస్తున్న బెదురు చూపులే!